

హైదరాబాద్ వార్త

# ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ దంపతులు



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో అమ్మావారిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు.

**బేగంపేట జూలై 11,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు అమ్మ వారికి బోనం,పట్టు వస్త్రాలు సమర్పించారు. కుటుంబ సమేతంగా అమ్మమవారికి వారు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, దేవాదాయ శాఖ కమీషనర్ ఐ.వెంకటరావు,ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి,గవర్నర్ దంపతులకు స్వాగతం పలికారు. గవర్నర్ రాక సందర్భంగా ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బద్రతను ఏర్పాటు చేసారు.

**ఆషాడబోనాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి : మంత్రి పొన్నం ప్రభాకర్**

జంట నగరాల్లో ఆషాడ బోనాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాల ప్రకారం మంత్రి పొన్నంకు ఆలయ అధికారులు స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేసారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ గత నెల 26న గోల్కొండ జగదాంబ తొలి బోనాలు ప్రారంభమై జులై 1వతేదీన బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం జరిగిందన్నారు. ఆదివారం 13వతేదీన సికింద్రాబాద్‌శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరుపున ఇప్పటికే పటిష్టమైన ఏర్పాట్లు చేసామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మ వారికి లష్కర్ బోనం సమర్పించనున్నారని ఆయన తెలియజేసారు. ప్రభుత్వం పక్షాన కలెక్టర్ దేవాదాయ శాఖ పోలీసుశాఖ జీహెచ్‌ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారన్నారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసినా ప్రజల సహకారం కూడా అంతే అవసరమన్నారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లష్కర్ బోనాలు ఎంతో చారిత్రాత్మకమైనవని,ప్రజలు అన్ని విధాలుగా సహకరించి బోనాలను విజయవంతంగా ముగించేందుకు అధికారులకు సహకరించాలన్నారు. ప్రజలను ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారు చల్లంగా చూడాలన్నారు. రాష్ట్రమంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మ వారిని తాను ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. గవర్నర్ దంపతులు అమ్మ వారిని దర్శించుకోవడం చాలా సంతోషం అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు అమ్మ వారి చరిత్రను ఆలయ పూజారులను అడిగి తెల్సుకున్నారని, ఈ నెల 13న బోనాలు,14న రంగం కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణా ప్రజల బాగుకోసం ఆషాడ బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకుందామని ఆయన తెలియజేసారు.

# లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాలు ప్రారంభం

**-ఉత్సవాలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్**



లాల్‌దర్వాజ సింహవాహినీ శ్రీ మహంకాళీ మందిరంలో జరిగిన శిఖర పూజ కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్,జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



లాల్‌దర్వాజ సింహవాహినీ శ్రీ మహంకాళీ మందిరంలో జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్,

**చార్మినార్,జూలై 11 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలోని చారిత్రాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ దేవాయలంలో ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలు శుక్రవారం డప్పు చప్పులు,వేదమంత్రోచ్చరణ మధ్య అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయంలో శుక్రవారం ఉదయం శ్రీ గణపతి హోమం,సప్తశతి పారాయణం,ప్రవచానాలు,అమ్మ వారికి అభిషేకం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌లు కలిసి శిఖర పూజ,ధ్వజరోహణ గావించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం లాల్‌దర్వాజ సింహవాహి ని శ్రీ మహంకాళీ మందిరంలో అమ్మ వారికి నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్,సౌత్ జోన్ డిసిపి స్నేహ్ మెహ్రాతో పాటు పలువురు అధికారులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణలో బోనాలు జాతర ఉత్సవాలు చాలా పెద్ద పండగని,నెల రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా ఎంతో వైభవంగా ప్రజలు బోనాల ఉత్సవాలను జరుపుకుంటారని తెలిపారు. పాతబస్తీ లాల్ దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ మందిరంలో పది రోజుల పాటు మందిరం కమిటి ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు జరగనున్నాయని, అందుకు ప్రభుత్వం తరుపున సహకారం అన్ని విధాలు ఉంటుందని ఆయన తెలియజేశారు. బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని,బయట నుంచి కూడ పోలీస్ బలగాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొన్నంప్రభాకర్,కొండా సురేఖలు సమావేశాలలో పాల్గొన్నారని,ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ఏర్పాటు చేయాలని అన్ని శాఖల అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారని,బోనాలు ఘనంగా జరగటానికి ప్రభుత్వం పరంగా అన్ని ఏర్పాట్లు చేశామని సిపి సి.వి. ఆనంద్ తెలియజేశారు. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా పాతబస్తీలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్ మారుతి యాదవ్, కన్వీనర్ జి.ఆరవింద్ కుమార్ గౌడ్,ప్రధాన కార్యదర్శులు పోసాని సతీష్ కుమార్,బి. ఆమరనాథ్ యాదవ్‌లు ఆలయ మర్యాదలతో ఇద్దరు కమిషనర్‌లకు పూర్ణ కుంభం,మంగళవాయిధ్యాలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కాగా దేవాలయం కమిటి ఆధ్వర్యంలో రూపొందించిన బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను కమిషనర్లు ఆవిష్కరించారు. ఎ.మాణిక్ ప్రభు గౌడ్ కుటుంబ సభ్యులు అమ్మ వారికి తొలి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిసిపి కె.అపూర్వరావు (ఎస్‌బి),దక్షిణ మండలం డిసిపి స్నేహ్ మెహ్రా, ట్రాఫిక్ డిసిపి ఆర్.వెంకటేశ్వర్లు,జిహెచ్‌ఎంసి చార్మినార్‌జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న,ఆలయ కమిటి మాజీ చైర్మన్ కె.వెంకటేష్‌తో పాటు ఆలయం కమిటి ప్రనిధులు పలువురు పాల్గొన్నారు.

**శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయంలో బోనాలు ప్రారంభం**

చారిత్రాత్మకమైన హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ దేవాలయం 77వ వార్షిక బోనాల జాతర ఉత్సవాలు శుక్రవారం ఉదయం ప్రారంభం అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ ఎస్.నందా ధ్వజారోహణ చేసి బోనాల ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయకమిటి ప్రతినిధులు జస్టీస్ నందాను ఘనంగా సన్మానించారు. కాగా అక్కన్న మాదన్న ప్రార్దన మందిరంలో మాతృమూర్తులచే మూడవ శుక్రవారం సామూహిక కుంకు మార్చన కార్యక్రమం జరిగింది. పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన దాదాపు 500 మంది మహిళలు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# "నాలాల ఆక్రమణ"లపై హైడ్రా పంజా

**-కూకట్‌పల్లి, చింతలబస్తీ ప్రాంతాల్లో నిర్మాణాలు కూల్చివేత**
**-జెసిబిలతో పూడికతీత..వరద సాఫీగా సాగేలా చర్యలు**



మూసాపేట్ ఐడిఎల్ నాలావద్ద ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జులై 11,ప్రభాతవార్త:**

నగరంలో నాలాల ఆక్రమణలపై హైడ్రా పంజా విసురుతుంది. ఎక్కడెక్కడ నాలాలపై నిర్మాణాలు జరిగాయో గుర్తించి వాటిని కూల్చివేస్తుంది. ఈమేరకు శుక్రవారం కూకట్‌పల్లి, ఖైరతాబాద్ పరిసరాల్లోని నాలాలపై ఉన్న ఆక్రమణలను తొ లగించింది. నాలాల ఆక్రమణల వల్ల కాలనీలు, బస్తీలు నీట మునగకుండా చూడాలని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులతో కలసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐడీఎల్ నాలాతో పాటు.. బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. శుక్రవారం ఈ రెండు నాలాల ఆక్రమణలను తొలగించే పనులు ప్రారంభించింది.

**బుల్కాపూర్ నాలా ఆక్రమణల తొలగింపు**

తుమ్మలబస్తీ పరిసరాల్లో బుల్కాపూర్ నాలా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలైన ఈ నాలా ఐటీ ప్రాంతాలను సస్యశ్యామలం చేసి హైదరబాద్‌లో అడుగుపెట్టి చింతల బస్తీ, తుమ్మలబస్తీ మీదుగా ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా హుస్సేన్ సాగర్‌లో కలుస్తున్న చరిత్ర ఈ నాలాది. ఈ నాలా చాలా చోట్ల ఆక్రమణలకు గురైంది. మరీ ముఖ్యంగా తుమ్మలబస్తీ ఆనందనగర్ మధ్య 8 మీటర్లుండాల్సి ఉండగా.. కేవలం 5 మీటర్లకే పరిమితమైంది. దీంతో వర్షాలు పడినప్పుడు..వరద సాఫీగా సాగక తుమ్మలబస్తీతో పాటు.. అటు ఆనందనగర్ కాలనీల్లోకి మురుగు నీరు పోటెత్తతున్నట్టు స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. శ్రీధర్ ఫంక్షన్ హాల్ యజమానులు నాలాలో నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. పై భాగంలో కూడా కొంతమేర ఆక్రమణ జరగగా.. అక్కడ నివాసితులు తమకు తాము తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారికి కొన్ని రోజులు హైడ్రా గడువు ఇచ్చింది. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద కల్వర్టుకు ముందు ధర్మాకోల్ వ్యర్థాలను కూడా హైడ్రా తొలగించింది. దీంతో వరద సాఫీగా సాగేందుకు మార్గం ఏర్పడింది.

**ఐడీఎల్ నాలా ఆక్రమణలు కూడా....**

కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు నుంచి మొదలైన నాలా వెడల్పు 7 మీటర్లుండాల్సి ఉండగా.. చాలా చోట్ల 2 మీటర్లకే పరిమితమైంది. దీంతో హబీబ్‌నగర్, శ్రీహరినగర్, శివశక్తి నగర్ నీట మునగడం పరిపాటిగా మారింది. నడుంలోతు నీళ్లుంటాయని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నాలాకు ఆనుకుని ఆక్రమణలకు పాల్పడిన ఎన్‌ఆర్‌సీ, ఎన్‌కేఎన్ ఆర్ ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు 3 మీటర్లకు పైగా జరిపిన ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఈ రెండు ఫంక్షన్ హాళ్ల పొడుగునా 50 నుంచి 70 మీటర్లమేర ఆక్రమణలను తొలగించి వరద నీరు సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకుంది. ఐడీఎల్ చెరువు నుంచి మొదలైన ఈ నాలా మూసాపేట మెట్రోస్టేషన్ దాటి కూకట్‌పల్లి నాలాలో కలుస్తుంది. ఇలా 2 కిలోమీటర్ల మేర పలుచోట్ల ఆక్రమణలను హైడ్రా తొలగించే పనులు ప్రారంభించింది. మూసాపేట మెట్రో స్టేషన్‌కు ఆనుకుని ఉన్న శివశక్తి నగర్ దగ్గర నాలా కేవలవం మీటరున్నరకు కుంచించుకుపోవడంతో అక్కడ ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంది.

# రోడ్ సేఫ్టీపై జిహెచ్‌ఎంసి స్పెషల్ డ్రైవ్



ఎర్రమంజిల్‌లో రోడ్డు మరమ్మత్తు పనులు పరిశీలిస్తున్న ఛీఫ్ ఇంజనీర్ రత్నాకర్

**హైదరాబాద్, జూలై 11,ప్రభాతవార్త:**

వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, నగరంలోని రోడ్లపై ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూడటమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ ఇంటెన్సివ్ మెయింటెనెన్స్ డ్రైవ్‌ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ (మెయింటెనెన్స్) విభాగం ఆధ్వర్యంలో 7500 ప్రాంతాలలో గుర్తించిన బీటీ, సీసీ రోడ్లపై పాట్‌హోల్స్ ఫిల్లింగ్, క్యాచ్ పిట్స్ మరమ్మతులు, సెంట్రల్ మీడియన్‌లలో మైనర్ రిపేర్లు తదితర పనులను వేగవంతంగా చేపట్టారు. ఈ పనులలో భాగంగా చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్ శుక్రవారం ఎర్రమంజిల్ ప్రధాన రహదారిపై జరుగుతున్న మరమ్మత్తు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు, నగరంలోని వాహనదారులకు రహదారులపై సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే 7500 ప్రాంతాల్లో సమస్యాత్మకంగా గుర్తించిన రోడ్లపై మరమ్మత్తుల పనులు ఒక వారం లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని, ప్రజల భద్రతే ముఖ్యమని చీఫ్ ఇంజినీర్ స్పష్టం చేశారు.

## ముగ్ధమనోహరం శరణ్య కూచిపూడి రంగప్రవేశం

**రవీంద్రభారతి, జూలై 11 ప్రభాతవార్త :**



ప్రముఖ నాట్యగురువు ఆషా నాయుడు శిష్యురాలు, నీలిమా శశి పాలకోడేటిల తనయ శరణ్య శ్రీనిధి చిక్కని సాహిత్యం, చక్కని సంగీత చిక్కని సాహిత్యంలో పొదిగి అద్భుతంగా తీర్చిదిద్దిన భక్తిరస కీర్తనల్లోని భావాలకు అనుగుణంగా అభినవపాటవాన్ని ప్రదర్శిస్తూ యువనర్తకి శరణ్య శ్రీనిధి పాలకేడేటి శృతిలయబద్ధంగా సంప్రదాయరీతిలో రంగప్రవేశంలోనే పరిపూర్ణతతో ముగ్ధమనోహరంగా నర్తించి ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. శరణ్య నృత్యకళాకారిణిగానే కాకుండా ఔత్సాహిక యువతకు కూచిపూడి నృత్యాన్ని నేర్పించడం, పట్టభద్రురాలైన విద్యావేత్తగా కొనసా గడంతోపాటు విదేశాల్లో భారతీయ శాస్త్రీయ కళలను పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ నుండి ప్రశంసాపత్రాన్ని అందుకోవడం విశేషం. రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో శుక్రవారం రాత్రి శరణ్య శ్రీనిధి తన కూచిపూ డి రంగప్రవేశాన్ని గణేశ పంచరత్నం అంశంతో ప్రారంభించి తదుపరి ఆనంద తాండవం, నీలమేఘ శరీర తరంగం, కామాస్‌రాగం ఆదితాళంలో జావళి, భామాకలాపం ప్రవేశ దరువు, ధనశ్రీ తిల్లానా తదితర అంశాలను అలవోకగా నర్తించి తన ప్రతిభ నైపుణ్యాన్ని చాటుకొని ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య ప్రశంసలు, శుభాశీస్సులందుకుంది.

# మాలలకు జరిగే అన్యాయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతా




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వివేక్‌వెంకటస్వామి, చిత్రంలో జి.చెన్నయ్య, రాజువస్తాద్ తదితరులు

**సైఫాబాద్, జులై 11 ప్రభాతవార్త:** మాలలకు జరిగే అన్యాయంపై ప్రశ్నిస్తానని, ఎస్సీ వర్గీకరణ ద్వారా రోస్టర్ విధానంలో గ్రూప్-3లోని మాలలకు జరిగే నష్టాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్ప, ఫ్యాక్టరీల శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి చెప్పారు. శుక్రవారం వాసవి క్లబ్‌లో జరిగిన మాల మహానాడు ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్సీల రిజర్వేషన్‌లను 18 శాతంకు పెంచాలని తన వంతు కృషి చేస్తానని, మాలలకు రాజ్యాంగ బద్ధమైన హక్కుల గురించి మాట్లాడతానని ఆయన చెప్పారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ రోస్టర్ విధానం లోపభూయిష్టంగా ఉందని, కుట్ర పూరితంగా వర్గీకరణపై వేసిన కమిటీ సభ్యులు అధికారులు రూపొందించారని, దీంతో మాల విద్యార్థులు, ఉద్యోగులు తీరని అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-3లోని 26 కులాలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్‌లు కూడా అందకుండా రోస్టర్ విధానాన్ని రూపొందించడం జరిగిందని, ఒక్క ఉద్యోగం కూడా మాలలకు రాకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన శాతవాహన యూనివర్సిటి, అసిస్టెంట్ డెంటల్ ప్రొఫెసర్ పోస్టులే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సమావేశానికి మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా సమావేశంలో ఆల్ ఇండియా ఎస్సీ హక్కుల రైట్స్ ప్రొటెక్షన్ సొసైటి జాతీయ అధ్యక్షుడు రాజు వస్తాద్ తదితరులు పాల్గొన్నారు.

## భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :**

మద్యానికి బానిసైన భర్త వేధింపులు బరిచలేక ఫ్యానుకు ఉరివేసుకుని వివాహిత మృతి చెందిన సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లాపూర్‌లో నివాసం ఉంటున్న సాదిక్ అలీ అనే వ్యక్తికి పది సంత్సరాల క్రితం సమీనా బేగంతో పెద్దలు కుదిర్చిన పెళ్లి అయ్యింది. వీరికి ముగ్గురు సంతానం పెళ్లి అయిన రెండు సంవత్సరాల తర్వాత సాదిక్ అలీ అనే వ్యక్తి సమీనా బేగంను మద్యానికి బానిసై వేధించటం మొదలు పెట్టాడు. సమీనా బేగంను మానసికంగా, శారీరకంగా వేధించేవాడని ఈ విషయాన్ని ఆమె వాళ్ల కుటుం సభ్యులకు తెలియజేసింది. 10వ తేదీ సాదిక్ అలీ రాత్రి సమయంలో భార్యతో గొడవపడ్డాడు. తీవ్ర మనస్థాపానికి గురైన భార్య సమీనా బేగం శుక్రవారం ఉదయం సాదిక్ అలీ పనికి వెళ్లిన తర్వాత ఆమె ఇంట్లోని సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమీనా బేగం చావుకు భర్త సాదిక్ అలీయే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు



వెంగళ్‌రావునగర్‌లో గురుద్వార్ కమాన్ వద్ద సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వర్‌రావు

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళ్‌రావు నగర్, యూసుఫ్‌గూడ, షేక్‌పేట్ ప్రాంతంలో రూ.5.15 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వర్‌రావు శంకుస్థాపనలు చేశారు. వెంగళ్‌రావునగర్ గురుద్వార్ కమాన్ వద్ద రూ.100.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా యూసుఫ్‌గూడ వార్డు పరిధిలోని కమలాపూర్ కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ పక్కన రూ.95.75 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి షేక్‌పేట్ వార్డు పరిధిలో రూ.315.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఫ్లయిఓవర్ కింద కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫుట్‌పాత్‌తో పాటు హరిజన బస్తీ వద్ద సీసీరోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.5 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయటం జరిగిందని జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో ముందుచుతామని అన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలను పరిష్కరించటం జరిగిందని గత 10 ఏళ్లుగా హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీలలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాతినిథ్య వహించిన వారికి సన్నిహితంగా ఉన్న వారి నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి జరిగాయని నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో తాగు నీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా పరిష్కారం చేస్తున్నామని నగరంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చటానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నగర ప్రజలు ఎక్కడైనా ప్రజా సమస్యలు ఉంటే స్థానిక అధికారి ప్రజా ప్రతినిధుల దృష్టికి లేదా మంత్రుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఇల్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని సన్నబియ్యం పంపిణీ చేస్తూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాతో పాటు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందిస్తున్నామని తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి కోరారు. అనంతరం మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వర్‌రావులు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు నాలాలు, సీసీరోడ్లు, డ్రింకింగ్ వాటర్ సమస్యలను తీర్చమని తమ దృష్టికి తీసుకువస్తే ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, నగర జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆర్‌వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనా, వి.నవీన్ యాదవ్, అజారుద్దీన్, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డి, గుర్రం మురళీగౌడ్ పాల్గొన్నారు.

## స్కూలు బస్సు ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

**కుషాయిగూడ, జూలై 11, ప్రభాతవార్త :**

అక్షర పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మీద అదే పాఠశాల బస్సు ఢీకొని తీవ్ర గాయాలైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు తెలిపి వివరాలు ప్రకారం కుషాయిగూడ లోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ఇదే స్కూల్ బస్సు ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న చైతన్య గోపిశెట్టి కుషాయిగూడ సుభాష్ చంద్ర నగర్ కాలనీకి చెందిన మరో బాలుడు శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో సైకిల్ పై స్కూలుకు వస్తుండగా అదే స్కూల్ కి చెందిన టిఎస్ 08యు1780 గల బస్సు ఢీ కొట్టడంతో చెయ్యి నుజ్జు నుజ్జయ్యింది. దీంతో బాలుడిని యశోద సికింద్రాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. బాలుడి ప్రమాదానికి కారణమైన బస్సు పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పాతబస్తీలో క్యాబ్ డ్రైవర్ హత్య

**చార్మినార్,జూలై 11 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఓ క్యాబ్ డ్రైవర్ హత్యకు గురైన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...హాఫీజ్ బాబానగర్,ఉమ్మర్ కాలనీకి చెందిన ఎంఎ అజీజ్ అలియాస్ అక్తర్ (22) వృత్తి రీత్యా క్యాబ్ డ్రైవర్. కాగా ఉమ్మర్ కాలనీలోని నాలా ప్రక్కన ఎంఎ అజీజ్ మృత దేహం శుక్రవారం ఉదయం పడి ఉంది. సమాచారం అందుకున్న చాంద్రాయణగుట్ట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్యాబ్ డ్రైవర్ ఎంఎ అజీజ్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. చని పోయిన అజీజ్ గొంతుతో పాటు అక్కడక్కడ గాయాలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు అజీజ్‌ను హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అజీజ్‌పై మోటారు వాహనాల దొంగతనం కేసు కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో నమోదై ఉంది. ఈ కేసును చాంద్రాయణగుట్ట పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్

**కంటోన్మెంట్, జూలై 11 ప్రభాతవార్త:** ఆదివారం నాడు బోనాల సందర్భంగా కుటుంబ సభ్యులతో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఉజ్జయిని మహంకాళి దేవాలయం, రేణుక ఎల్లమ్మ, మావురాల పెద్దమ్మ దేవాలయం, పోచమ్మ, కట్ట మైసమ్మ మరియు ఉప్పలమ్మ దేవాలయాలలో అమ్మవారిని దర్శించుకొని ఒడి బియ్యం సమర్పించుకున్నారు.

## నిరంతర ఆంగ్ల అభ్యాసం ద్వారా కెరీర్‌లో పురోగతి సాధించవచ్చు



ప్రసంగిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్

**చిక్కడపల్లి, జూలై 11 ప్రభాతవార్త:** నిరంతర ఆంగ్ల అభ్యాసం ద్వారా కెరీర్‌లో పురోగతి సాధించవచ్చని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల లో ఆంగ్ల విభాగం "నిరంతర ఆంగ్ల అభ్యాసం ద్వారా కెరీర్ పురోగతి" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా శేఖర్, కళాశాల ఆంగ్లవిభాధిపతి కె.కవిత మాట్లాడారు. ఈ సదస్సులో ప్రఖ్యాత నిపుణురాలు పెర్సిస్ సునీత అంతర్దృష్టితో కూడిన ప్రజంటేషన్ ఇచ్చారు, ఇది నేటి పోటీ ఉద్యోగ మార్కెట్లో ఆంగ్ల ప్రావీణ్యం యొక్క కీలక పాత్రను హైలైట్‌గా నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. కెరీర్ ఎదుగుదలకు, విజయానికి రాతపూర్వక, మాట్లాడే బలమైన కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంత అవసరమో ఇందులో ప్రస్తావించారు. పెర్సిస్ సునీత సమర్థవంతమైన అధ్యయన పద్ధతులు, అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకోవడం, కమ్యూనికేషన్ లో విశ్వాసాన్ని పెంపొందించడంతో సహా ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి ఆచరణాత్మక చిట్కాలు, వ్యూహాలను అందించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలతో కార్యక్రమం ఎంతో ఆసక్తిని కనబరిచింది.

### ఆశాడ బోనాల సందర్భంగా చెక్కుల పంపిణీ



జీటీఎస్ దేవాలయంలో ఆశాడం బోనాల చెక్కులను అందజేస్తున్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి.

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశాడ బోనాల జాతర పండుగ సందర్భంగా ప్రభుత్వం ద్వారా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల బస్తీల కాలనీల దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వెంగళ్‌రావునగర్, జీటీఎస్ కాలనీ శ్రీ వీరాంజనేయ భవాని శంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజారుద్దీన్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### రక్త దానం చేయండి ప్రాణదాతలు కండి.

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :** నిమ్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 1వ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ చేతల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అంటూ ముందుకు వచ్చారు. ఈ రక్తదాన కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నరేంద్రసింగ్, ఆర్ఐ రాజేష్, నిమ్స్ బ్లడ్ బ్యాంక్ సెంటర్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణ కోఆర్డినేటర్ వెంకటరత్నం, బిడుగు శేఖర్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ మల్లికార్జున, డాక్టర్ రంజిత్, డాక్టర్ కోమలి తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత విద్యాను అభ్యసించే వారిదే భవిష్యత్తు :కార్పొరేటర్



నోట్‌బుక్‌లను అందచేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

**బేగంబజార్, జూలై 11ప్రభాతవార్త:** జాంబాగ్ డివిజన్ పరిధిలోని గౌలిగూడ జాన్సీ హైస్కూల్‌లోని విద్యార్థులకు డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ నోట్ బుక్‌లను అందచేశారు. ఈసందర్భంగా ఆయన ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా విద్యార్ధినీ, విద్యార్థులకు నోట్ బుక్‌లను అందచేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అమర్‌సింగ్, రాజు, అనిల్, శివకుమార్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి



**గన్‌ఫౌండ్రి, జూలై 11ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని గోషామహల్ బిఆర్‌ఎస్ నేత ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన జిహెచ్‌ఎంసి, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి జాంబాగ్, గన్‌ఫౌండ్రి డివిజన్ల పరుధిలో పలు బస్తీలో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగితెలుసుకున్నారు. బోనాల పండుగ సమీపించిన నేపథ్యంలో గోషామహల్ నియోజకవర్గంలోని ఆలయాల వద్ద పరిసర ప్రాంతాల్లో కచ్చామోరీల పూడికతీత దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్క్‌పనులు, పొల్యూషన్ వాటర్‌సప్లై తదితర సమస్యలను వెంటనే పరిష్కరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో బచ్చన్‌సింగ్, మేనేజర్ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే తలసాని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని.

**బేగంపేట జూలై 11,ప్రభాతవార్త**

ఈ నెల 13న జరగనున్న సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద ఆయన అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయన అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు మనందరి పండుగ అని గొప్పగా జరుపుకుందామని కోరారు. బోనాల సందర్భంగా ఎంతో చరిత్ర కలిగిన మహాకాళీ అమ్మ వారి దర్శనం కోసం బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమ్మ వారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలని భక్తులు మొక్కులు తీర్చుకుంటారని అన్నారు. 13వతేదీన తెల్లవారు ఝూమున 3గంటల నుంచే బోనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు క్యూలైన్లలో ఇబ్బందులు పడకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేసామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి అదనపు పోలీసు సిబ్బందిని కూడా రప్పించినట్లు తెలియజేసారు. భక్తులకు తాగునీరు అందించేందుకు వాటర్ వర్క్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. దక్కన్ మానవ సేవా సమితి, ఆర్యసమాజ్, వంటి పలు సంస్థలు వాలెంటీర్‌లుగా భక్తులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మల్లిఖార్జున్‌గౌడ్, అరుణాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఈఈ ,డీసీ డాకు నాయక్, ఈఈ సుబ్రమణ్యం, వాటర్‌వర్క్స్ డీజీఎం ఆశీష్, తహశీల్దార్ పాండునాయక్ నాయకులు శ్రీహరి తదితరులు ఉన్నారు

## పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఆరెకటిక సంఘం సన్మానం



పద్మశ్రీ మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న ఆరెకటిక సంఘం సంరక్షక్ జాతీయ కార్యదర్శి నితికర్ ప్రేమ్‌లాల్‌జీ తదితరులు

**హైదరాబాద్, జూలై 11 ప్రభాతవార్త**

అణగారిన వర్గాల కోసం మూడు దశాబ్దాలుగా మంద కృష్ణ మాదిగ నిర్వహిస్తున్న ఉద్యమంలో న్యాయం ఉందనడానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ పురస్కారమే సాక్షమని ఆల్ ఇండియా ఆరెకటిక సంఘం సంరక్షక్ జాతీయ కార్యదర్శి నితికర్ ప్రేమ్‌లాల్‌జీ అన్నారు. తెలంగాణ ఆరెకటిక సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇటీవల మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు లభించినందున అంబర్‌పేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఎమ్మార్పీఎస్ కేవలం మాదిగల పోరాటం మాత్రమే కాదని, న్యాయం కోసం సాగిన మహత్తర ప్రజాస్వామ్య ఉద్యమం అని అన్నారు. మాదిగలకు ఎస్సీ వర్గీకరణ విషయంలో మందకృష్ణ మాదిగ చేసిన పోరు చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఆరెకటిక సంఘం సంరక్ష ఎన్. ప్రేమ్ లాల్‌జీ, మందకృష్ణ మాదిగను శాలువా, పూలమాల జ్ఞాపకతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రజలు, ప్రజాస్వామ్యం వాదులు సహకారం మరువలేనిదని వివరించారు. నా సేవలను గుర్తించి నన్ను సన్మానించినందుకు ఆరెకటిక సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిరియాల పుష్పరాజ్‌జీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి చుక్కంద సూర్య, కె జానకిరామ్, డి డెక్వాడ్ ప్రకాష్ జనరల్ సెక్రెటరీ, ఎం.గన్‌శామ్.జి.శివానంద, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ కోఆర్డినేటర్ జి.వేణు గోపాల్‌ముదిరాజ్, మందకృష్ణ మాదిగను శాలువా పూలమాలలతో సన్మానించి అభినందించారు.

## అంబర్‌పేటలో రూ.10 కోట్లతో రోడ్డు పనులు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బర్కత్‌పురలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తదితరులు

**హైదరాబాద్, జూలై 11 ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గంలో 10 కోట్లతో రోడ్ల పనులు, మరో మూడు కోట్లతో వాటర్ వర్క్స్ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వెల్లడించారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ పర్వరీష్ బాగ్ కాలనీలో రూ.29 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంబించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ ద్వారా ఇప్పటికే రూ.10 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని. మరో రూ.10 కోట్ల రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. వీటికి నిధులు కూడా మంజూరై టెండర్ ప్రాసెస్లో ఉన్నాయని, వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. జలమండలి ఆధ్వర్యంలో రూ.3కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో రూ.3కోట్ల కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ప్రణాళికాబద్ధంగా ప్రగతి. ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికబద్ధంగా ప్రగతి సాధిస్తున్నామని, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజ్, మంచి నీటి వసతిని మెరుగుపరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసురోవడంతో పాటు వాటికి శాశ్వత ప్రతిపాదికన పరిష్కారాలు చూపిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, సిబ్బందికి సూచిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా ఎవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఆసిస్టెంట్ ఇంజనీర్ ప్రశాంత్, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణ. వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, బీఆర్‌ఎస్ డివిజన్ ఆధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్లీ, బబ్లూసింగ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బల్బీర్, బి.భీమ్‌రాజ్, ఎస్. రవియాదవ్, హజారి బాబు, తదితరులు పాల్గొన్నారు

## చిన్నారి మృతిపై వైద్య శాఖ సమగ్ర విచారణ జరపాలి



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**నాచారం, జులై 11 ప్రభాతవార్త :** చిన్నారి మృతిపై వైద్య శాఖ సమగ్ర విచారణ జరపాలని సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. గాంధీ హాస్పిటల్లో మృతి చెందిన చిన్నారి ఘటనపై స్పందిస్తూన సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు శుక్రవారం మల్లాపూర్ ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట వారు ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్ డివిజన్ సూర్యనగర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్లాపూర్ బాబానగర్ కు చెందిన గుడిసె కవిత గురువారం మల్లాపూర్ సూర్య నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీ కోసం సాయంత్రం ఐదున్నర గంటలకు వెళ్ళింది. డ్యూటీలో ఉన్న డాక్టర్లు నిర్లక్ష్యంగా స్టాఫ్ నర్స్ తో డెలివరీ చేయించడంతో పాప మృతి చెందింది. సదరు డాక్టర్, స్టాఫ్ నర్సు నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తూ, భాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఉప్పల్ మండల సమితి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. మల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సు ఇప్పటివరకు 75కు పైగా డెలివరీలు చేశానని బాహాటంగా చెబుతుందంటే, ఈ ఆసుపత్రిలో డాక్టర్ సేవలు నిరుపయోగమనే భావన వ్యక్తం అవుతుందని ఆరోపించారు. చిన్నారి ఘటన విషయంలో స్టాఫ్ నర్సు అన్నీ తానై, డాక్టర్ కు సమాచారం ఇచ్చినా సమయానికి రాకపోవడంతో వల్లనే చిన్నారి మరణించిందని వారు ఆరోపించారు. ప్రజల పట్ల, పేషెంట్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఈ ఆసుపత్రికి సాధారణంగా మారిందని విమర్శించారు. చిన్నారి మృతి ఘటనపై జిల్లా వైద్యశాఖ అధికార యంత్రాంగం సమగ్రమైన విచారణ జరిపి, ఘటనకు కారకులైన డాక్టర్, స్టాఫ్ నర్సులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం, ఈ ఘటనపై విచారణ జరపడానికి ఆసుపత్రికి వచ్చిన మేడ్చల్ జిల్లా డిప్యూటీ వైద్యశాకాదికారి సత్యవతికి సంఘాల పక్షాన ఫిర్యాదు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజీమ్ పాషా, మహిళా సమాఖ్య నాయకురాలు మేరీ, స్వర్ణ ,కావ్య, రాజు పాల్గొన్నారు.

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వేముల వెంకటేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఏడుకొండలు, పీట్ల శ్రీధర్, వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, జూలై 11 ప్రభాతవార్త**

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని జాతీయ వడ్డెర సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం అత్తాపూర్‌లో జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వేముల వెంకటేష్ సంతాప సభ జరిగింది. ఈ సభలో జాతీయ వడ్డెర సంఘం నేతలు ఏడుకొండలు, పీట్ల శ్రీధర్, వేముల రామకృష్ణ, మొగిలి, వల్లెపు శివ, పిట్ల గోపాల్, లక్ష్మీ కాంతయ్య, లోకనాథం, మారయ్య, వల్లెపు గణేష్ ,పల్లెకు, రమేష్, భవాని విజయలక్ష్మీ తదితరులు మాట్లాడారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాడానికి రాజకీయాలకు అతీతంగా సంఘటితం కావాలని పిలుపు నిచ్చారు. విద్యా ఉద్యోగ రాజకీయపరంగా వెనుకబడిన ఒడ్డరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, అందుకు రాష్ట్రవ్యాప్త పర్యటనలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో 33 జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు వేముల వెంకటేష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## సాహిత్యాన్ని సర్వ జన హితం కోసం వాడిన సినారే : ఆచార్య కొలకలూరి ఇనాక్



ప్రఖ్యాత గీత రచయిత సుద్దాల అశోక్ తేజకి సినారె సాహితీ పురస్కారం ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 11 ప్రభాతవార్త:** సాహిత్యం ను సర్వ జన హితం కోసం వాడిన సినారె గొప్ప కళా మూర్తి, చైతన్య స్ఫూర్తి, ఆధునిక సాహిత్య వైతాలికుడు అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యా లయం పూర్వ వైస్ ఛాన్స లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణ లో డాక్టర్ సి.నారాయణ రెడ్డి జన్మ దినోత్సవం సందర్భంగా ప్రఖ్యాత గీత రచయిత సుద్దాల అశోక్ తేజకి సినారె సాహితీ పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎంకె.రాము ఆధ్వర్యంలో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఇనాక్ పురస్కారం బహుకరించి మాట్లాడారు. నిజాం భూస్వాములును దిక్కరించిన కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన సుద్దాల అశోక్ తేజకు సినారె పురస్కారం బహుకరించటం సముచితంగా వుంది అన్నారు. సినారె సినీ కవి అందరికీ తెలిసిన వారు కాని ఆయన 87 కావ్యాలు రాసిన సాహితీ. మూర్తిగా ప్రపంచ సాహితీ కారులకు తెలుసు అన్నారు. అధ్యక్షత వహించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరీ శివా రెడ్డి మాట్లాడుతూ సినారె పాట రాయటం పాడటం తెలిసిన వారు అని అలాగే అశోక్ తేజ కూడా రచన గానం చేయ గల ప్రతిభ కల వారు అన్నారు. సినారె కు రసమయి రాము అగ్రగణ్య శిష్యుడు అని చెప్పారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం లో పాల్గొన అశోక్ తేజకు సినారె పురస్కారం సముచితం అన్నారు. వేదిక పై డాక్టర్ చెన్నయ్య పాల్గొన్నారు డాక్టర్ రాము స్వాగతము పలు కుతూ అశోక్ తేజ నేను సైతం పాటకు జాతీయ అవార్డు అందుకున్న వారు అన్నారు. ఆశా లత వ్యాఖ్యానం లో రాము రచించిన సినారె మహాకవి నృత్య గీతానికి శృతి సమన్వ నాట్యం చేశారు.

### పేద, దళితులకు విద్యాధర్ విశేషమైన సేవలు



విద్యాధర్‌ను సత్కరిస్తున్న పద్మారావు, వినయ్‌కుమాం

**సైఫాబాద్, జులై 11 ప్రభాతవార్త:** ఐఆర్ఎస్ అధికారిగా విశాఖ పట్నం, హైదరాబాద్ నగరాల్లో విశేషమైన సేవలు అందించిన డా.జల్లి విద్యాధర్ సామాజిక, సాహిత్య రంగాలలోనే కాకుండా పేద, దళిత ప్రజలకు విశేషమైన సేవలు అందించారని ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్ కొనియాడారు. హైదరాబాద్‌లోని జిఎస్‌టి ఉప కమిషనర్‌గా పదవి విరమణ చేసిన విద్యాధర్‌ను శుక్రవారం వారు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో సిద్ధంత పరంగా కొనసాగుతూ ఎపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజన సంఘం కార్యక్రమాలను ఆయన పాల్గొంటు అన్ని వర్గాలకు వారికి, ఉద్యోగులకు నిరంతరం సేవలు అందించారని వారు తెలిపారు. విద్యాధర్ శేష జీవితం ప్రశాంతంగా కొనసాగాలని, భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యాన్ని అందించాలని వారు కోరారు.

### తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోలకు ఇవ్వండి

- బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



హిమాయత్‌సాగర్ గ్రామంలో తడి,పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :** ప్రజలందరూ తమ ఇళ్లల్లోనే తడి,పొడి చెత్తలను వేరు చేసి ఆటోలకు ఇవ్వాలని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ గ్రామంలో మహిళలకు తడి,పొడి చెత్తపై కమీషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్తను వేరు చేసి ఇస్తే నేరుగా తీసుకెళ్లి సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నామని, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు ఇవ్వడం జరుగుతుందన్నారు. తడి,పొడి చెత్తలను కలిపి ఆటోలకు వేస్తే దాన్ని వేరు చేయడం కష్టతరంగా మారుతుందని, ప్రజలందరూ ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇళ్లల్లో రెండు టబ్బులు ఉంచుకొని తడి,పొడి చెత్తలను వేరు వేరుగా వేసి ఇళ్ల ముందుకు వచ్చే కార్పొరేషన్ ఆటోలకు ఇవ్వాలని సూచించారు. అనంతరం భూగర్భ డ్రైనేజి పనులను పరిశీలించారు. వర్షాకాలం కావడం వలన వరదలు వస్తాయని, నీరు సులువుగా దిగువ ప్రాంతాలకు వెళ్లేలా పారిశుద్య సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఇ యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### ముష్కిన్ చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- ఇరిగేషన్ శాఖ ఏఈ నరేంద్ర



ముష్కిన్ చెరువు కట్ట పునర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ నరేంద్ర, నాయకులు మల్లేష్, రామకృష్ణారెడ్డిలు.

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :** నార్సింగిలోని ముష్కిన్ చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఏఈ నరేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఏఈ నరేంద్ర ముష్కిన్ చెరువు కట్ట వద్ద జరుగుతున్న పునర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్‌లు వేయిస్తామన్నారు. వరద నీటి కాలువలను కబ్జా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ఈ చెరువు స్థలం కబ్జాలకు గురవ్వకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకప్పుడు పంట పొలాలకు పారిన ఈ చెరువులోని నీరు నేడు భారీ అపార్టుమెంట్ల నుంచి వచ్చే డ్రైనేజి నీరుతో కలుషితం అవుతుందని, దాన్ని కలువకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల న్నారు. ఈ చెరువును కాపాడి ట్యాంక్‌బండ్‌లా పర్యాటక ప్రాంతంగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుద్ధోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వంద రోజుల ప్రణాలికలో భాగంగా శుక్రవారం నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణభగవాన్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుల దృశ్యం.

### జంతు సంరక్షణ చట్టాలను అమలు చేయాలి

-లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రేమ్‌చంద్ మునోత్ జైన్



ప్రేమ్‌చంద్ మునోత్ జైన్

**హైదరాబాద్, జూలై 11 ప్రభాతవార్త**

జంతు సంరక్షణ చట్టాలను సంవర్ధవంతంగా అమలు చేయాలని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి ఎనిమల్ వెల్ఫేర్ చైర్మన్ ప్రేమ్‌చంద్ మునోజ్ జైన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడారు. జంతు సంరక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ జంతువులను ప్రేమించాలని, జంతువుల అభివృద్ధికి కృషి చేసినప్పుడే మానవ జాతి మనుగడ సాధిస్తుందన్నారు. గోసేవలో భాగంగా గోవులకు మెడిసిన్, ప్రోటీన్స్, మినరల్ మిక్చర్ అందజేస్తున్నట్లు తెలిపా రు. నాగుల పంచమి రోజున పావులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. తన పరిధిలో ఉన్న వందకుపైగా లయన్స్ క్లబ్స్ ప్రతినిధుల సహకారంతో జంతు సంరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

### సూరారం పోలీస్ స్టేషన్ సిఐగా సుధీర్ కృష్ణ

**జీడిమెట్ల, జూలై 11, ప్రభాతవార్త**

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ పరిధిలోని సూరారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సుధీర్ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన భరత్ కుమార్ ట్రాఫిక్ విభాగానికి బదిలీ కాగా మేడ్చెల్‌లో పనిచేసిన సుధీర్ కృష్ణ బదిలీపై సూరారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో కఠినంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానని అన్నారు.

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

**కొంపల్లి, జూలై 11, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్.ఎల్. సి బస్వరాజు సారయ్య, బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, కో ఆర్డినేటర్స్ శశికళ యాదవ రెడ్డి, గజ్జెల కాంతం, ఏపి మిథున్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇంచార్జులు బండి రమేష్, వజ్రేష్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

### డెమోక్రసీ విలువలపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**పేట్ బషీరాబాద్, జూలై 11, ప్రభాతవార్త**

యువ మనస్సులలో ప్రజాస్వామ్య విలువలను పాదుకొల్పడానికి ఒక జీవంతమైన కార్యక్రమంగా సెయింట్ ఆంథోనీ హైస్కూల్ సుచిత్ర, కొంపల్లి శాఖలు శుక్రవారం విద్యార్థుల ఎన్నికలను నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఎకాడమిక్ డైరెక్టర్ ఎన్.ఆర్. సరిత, ప్రిన్సిపాల్ శర్మిలా క్రిస్టీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజాస్వామ్యం, సమానత్వం పౌర బాధ్యతల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. భారతదేశ ఎన్నికల వ్యవస్థ, పార్లమెంటరీ విధానం, ఓటు హక్కు యొక్క శక్తి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాస్తవ ప్రపంచ ఎన్నికల మాదిరిగానే ప్రచారాలు, ఓటింగ్ బూత్, బ్యాలెట్ లెక్కింపు జరిగాయి. ఈ సందర్భంగా కార్యదర్శి ఎన్.పి. సుందర రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అనేది కేవలం పాలనా వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక జీవన విధానం. ఇటువంటి కార్యక్రమాల ద్వారా, మన విద్యా ర్థులు తమ హక్కులు, బాధ్యతలను అర్థం చేసుకుని, జాతి నిర్మాణంలో భాగస్వాములు కావడానికి మేం ప్రయత్నిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రజాస్వామ్య సూత్రాలను పాటించి, దేశ నిర్మాణంలో తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### బోనాల కోసం అందంగా ముస్తాబైన అమ్మవారి ఆలయాలు

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :** ఆశాడ మాస బోనాల వేడుకలను పురష్కరించుకొని పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, భక్తులు ఆలయాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. నార్సింగిలోని పోచమ్మ గుడికి మాజీ కౌన్సిలర్ కొల్లూరు లక్ష్మి ప్రవళిక కిరణ్, స్థానియ నాయకులు కైరంకొండ వినోద్, శ్రీకాంత్, రాము, కృష్ణ, విష్ణు వర్ధన్‌రెడ్డి, బాలు ముదిరాజ్ తదితరులంతా కలిసి రంగులు వేయించారు. ఆలయం ఆవరణ అంతా చదును చేయించి, రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణ చేయించారు. బోనాలు ఎక్కించేందుకు ఆలయానికి వచ్చే మహిళా భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కొలిచిన వారికి కొంగ బంగారంగా నిలుస్తున్న గ్రామ దేవతలకు ఏటేటా బోనాలు ఎక్కించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం శుభ పరిణామమం అని పుర ప్రముఖులు పేర్కొంటున్నారు.

## స్థానిక సంస్థలలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి: షఫీ అహమ్మద్ ఖాన్



ముఖ్యమంత్రి ఓఎస్ డి వేముల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న షఫీ అహమ్మద్ ఖాన్, తుడుం రాజేందర్, దైనంపల్లి మల్లికార్జున్ తదితరులు

**మలక్ పేట జూలై 11, ప్రభాతవార్త:** స్థానిక సంస్థలలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ స్థానిక సంస్థలలో వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓ ఎస్ డి వేముల శ్రీనివాసులు ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధన కమిటీ రాష్ట్ర చైర్మన్ ఎండి షఫీ అహ్మద్ ఖాన్, ఎన్ పి ఆర్ డి ఇండియా జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి లు మాట్లాడుతూ స్థానిక సంస్థలలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించడం గురించి అమలు చేస్తున్న రాజస్థాన్, ఛత్తీస్ గడ్ ,తమిళనాడు రాష్ట్రాల నిబంధనలు ,చట్టాల అమలు విధానాల గురించి ఓఎస్డికి వివరించామని, ఈ విషయాల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ శబరి చావ్లా, విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

## వాహనాల ప్రయాణం కోసం చాదర్‌ఘాట్ సర్కిల్‌ను ఉపయోగించుకోవాలి : ట్రాఫిక్ డిసిపి వెంకటేశ్వర్లు



చాదర్ ఘాట్‌లో పర్యటిస్తున్న ట్రాఫిక్ డిసిపి వెంకటేశ్వర్లు, ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్ తదితరులు

**మలక్ పేట,జూలై 11, ప్రభాతవార్త:** మలక్ పేట మీదుగా కార్యాలయాలకు వెళ్లేటువంటి ప్రజలు చాదర్ ఘాట్ సర్కిల్ నుంచి నేరుగా ఎంజీబీఎస్, ఎస్ జె రోటరీ, ఎం జె మార్కెట్ మీదుగా సులువుగా నాంపల్లి లేదా జిపిఓ వైపు వెళ్ళవచ్చని సౌత్ జోన్ ట్రాఫిక్ డిసిపి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చాదర్ ఘాట్ సర్కిల్ ప్రాంతంలో కొనసాగుతున్న వాహనాల ట్రాఫిక్ ను సౌత్ జోన్ డిసిపి వెంకటేశ్వర్లు, మలక్ పేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్సై రాము తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉదయం పూట చాదర్ ఘాట్ బ్రిడ్జి మీదనుండి కాకుండా చాదర్ఘాట్ సర్కిల్ వెంబడి ఎంజీబీఎస్, ఎస్ జె రోటరీ, ఎం జె మార్కెట్ మీదుగా సులువుగా నాంపల్లి లేదా జిపిఓ వైపు వెళ్ళవచ్చని వివరించారు.ఈ మార్గములో ట్రాఫిక్ అంతరాయము చాలా తక్కువగా ఉంటుంది కావున ఇట్టి మార్గాన్ని వినియోగించవలసిందిగా వాహనదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.

**హయత్ నగర్, జులై 11 ప్రభాతవార్త:** ప్రభుత్వం కొనసాగిస్తున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో హెల్త్ క్యాంపును నిర్వహించారు. అబ్దుల్లాపూర్ మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆటోనగర్ లోని లెజెండ్ ఆసుపత్రి, విజయ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా కార్యాలయ మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లక్ష్మి ప్రసన్న, కల్పన, సువర్ణ, వైద్యులు శ్యామ్, శివ డీఈఈ జ్యోతి, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహంకాళీ అమ్మవారి ఆలయంలో శాకాంబరీ ఉత్సవం



శాకాంబరీ అలంకరణలో శ్రీ మహంకాళీ అమ్మవారు.

**వనస్థలిపురం. జూలై. 11.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ లోని హుడా ఓపెన్ ఆడిటోరియం సమీపంలో గల శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయంలో శాకాంబరీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు జగన్మోహన్ శర్మ వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరీ రూపంలో అలంకరించారు. మహిళలు అమ్మవారి ప్రాంగణంలో కూర్చొని భక్తిగీతాలు ఆలపించారు.అనంతరం శాకాంబరీ రూపంలో ఉన్న అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి అమ్మవారి ఆశ్వీర్వచనం పొందారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ నీళ్ల అంజన్ కుమార్ గౌడ్,అంతటి వీరాస్వామి గౌడ్,గోవర్ధన్ గుప్త, అనిల్ కుమార్,నీళ్ల హరి చరణ్ గౌడ్,కుమార్,మధుకర్ గౌడ్,భిక్షపతి, నీళ్ల రజినీ అంజన్ కుమార్ గౌడ్,శ్రీదేవి, నాగరాణి,అనిత,శారద తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి జూలై11, ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ఎన్ఎండిసి ముత్తూట్ ఫైనాన్స్ పక్కన కాలనీలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు సెంటర్ డ్రైనేజీ మరియు రోడ్డు కావాలని కోరారు. వెంటనే స్పందించి అధికారులతో కలిసి పరిశీలించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఈ లౌక్య, ఏ ఈ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజస్విని, కాలనీవాసులు గోపీనాథ్, వెంకట్ రెడ్డి గణేష్ శేఖర్ రెడ్డి రాజు సింగల్ రెడ్డి, కరీముల్లా హరీష్ కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ సంపత్ రావు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాట్లను రోడ్డు అంటూ చేస్తున్న ప్రచారాన్ని మానుకోవాలి

**మన్సూరాబాద్ ,జూలై 11, ప్రభాతవార్త:** మన్సూరాబాద్ డివిజన్ పరిధి శ్రీ వివేకానంద కాలనీలోని ప్లాట్ నెంబర్ 43 మరియు 44 లను రోడ్డు అంటూ కొంతమంది కాలనీ వాసులు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తూ అధికారులను తప్పు దోవ పట్టిస్తున్నారు ఆ స్థల యజమాని నారాయణ రావు నాయుడు తెలిపారు. శుక్రవారం కాలనీలోని ఆయన నివాసంలో హైకోర్టు అడ్వకేట్ సిహెచ్ సుబ్రహ్మణ్యం తో కలసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1979లో ఏర్పాటుచేసిన లేఔట్ ప్రకారం ప్లాట్ నెంబర్ 43 , ప్లాట్ నెంబర్ 44 సమీప బంధువు లక్ష్మపూర్ణమ్మకు చెందిందని ,కానీ కొంతమంది స్వ ప్ర యోజనాల కోసం తప్పుడు ఆధారాలతో హైడ్రాధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్లాట్ నెంబర్ 43ను సంజీవరావు వద్ద 2020 లో తాను ఏజిపి చేయించుకున్నట్లు వెల్లడించారు. జిహెచ్ఎంసి అధికారులు రోడ్డు నిర్మాణం కోసం రాగా ప్లాట్ కు సంబంధించిన అన్ని పత్రాలు చూపించడంతో వెళ్లిపోయొరని అనంతరం కోర్టుకు వెళ్లగా చట్టం ప్రకారం వెళ్లాలని, పొజిషన్ను డిస్టర్బ్ చేయవద్దని కోర్టు జిహెచ్ఎంసి కి సూచనలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు కోర్టులో కేసు కొనసాగుతుందన్నారు. కాలనీవాసుల ఫిర్యాదుతో పరిశీలనకు వచ్చిన హైడ్రా అధికారులు వారు చెప్పిన విధంగా తన వద్ద ఉన్న అన్ని పత్రాలు కార్యాలయంలో సబ్మిట్ చేసినట్లు పేర్కొన్నారు.

ప్లాట్ నెంబర్ 43 తనకు చెందిందని 44 సమీప బంధువుదని, కాలనీవాసులు రోడ్డు అంటూ ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసిన అధికారులు పరిశీలించి న్యాయం చేస్తారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాలనీలో రోడ్డు అక్రమణలు చేసిన వారి వివరాలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తానని , పక్కన అపార్ట్మెంట్ నిర్మాణదారుడు 100 గజాలను కబ్జా చేశాడని ఆయన ఆరోపించారు.

## బిసిల చైతన్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటన : కటకం



సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగరావు

**ఎల్.బి.నగర్, జులై 11 ప్రభాతవార్త:** బీసీలను చైతన్య పరచడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేసి సభలు సమావేశాలు నిర్వహిస్తామని మనఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు తెలిపారు.మనఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంనాగోల్‌లోని మాస్‌ప్రధాన కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్యనిర్వాహకుల చైతన్య సదస్సు సమీక్షా, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించడం జరిగిందన్నారు. 37 నియోజకవర్గాలలో ఆగస్ట్ 3న గ్రామగ్రామాన రెండో విడత జెండా ఆవిష్కరణ నిర్వహించాలని నియోజకవర్గాలను జోన్ల పరంగా విభజించి రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు బాధ్యతలను అప్పగించామన్నారు. జండా ఆవిష్కరణ కార్యక్రమంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో బీసీ భావజాలం బలంగా వ్యాప్తి జరుగుతుందని అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా మాస్ లోని గౌరవఅధ్యక్షులకు, పెద్దలకు కటకం నర్సింగ్‌రావు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహగౌడ్, పూస నరసింహబేస్త, నేరెళ్ల దేవేందర్, గుండ్ల ఆంజనేయులుగౌడ్, పంతంగి విట్టలయ్య గౌడ్, గునిగంటి చంద్రశేఖర్‌గౌడ్, రాష్ట్ర ప్రధానకార్య దర్శులు, బచ్చనబోయిన శ్రీనివాసులుయాదవ్, గోద మల్లికార్జున్‌గౌడ్, విద్యాసాగర్, రాష్ట్ర ప్రచారకార్యదర్శులు, పెద్దపూర బ్రహ్మయ్యరజక, పెండం లక్ష్మణ్‌నేత, జక్కుల బాలరాజ్‌యాదవ్, మారోజు రాజుచారి, గాది కృష్ణయ్య, భరద్వాజ్‌ముదిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మెర రవి, దశరథ్, సుంచు శ్రీనివాస్‌నేత, యారాల ప్రకాష్‌రజక, గోదా లింగస్వామిగౌడ్, సదాశివ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## మహేశ్వరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆషాఢ గోరింటాకు వేడుకలు

-జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి - సాంప్రదాయ ఆట, పాటలతో సందడి చేసిన మహిళలు



సబితా ఇంద్రారెడ్డితో గోరింటాకు వేడుకలు నిర్వహించిన మహిళలు

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** జిల్లెలగూడ ధాతునగర్ క్రాస్ రోడ్స్ ఆర్‌సిఐ రహదారిలోని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలు కనుల పండువగా జరిగాయి. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంత్రాలను నుండి వచ్చిన మహిళా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు, మహిళలు ఆనందోత్సాహాలతో గోరింటాకు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. గోరింటాకు సంబంధించిన సాంప్రదాయ సాంప్రదాయ జానపద గీతాలు, చప్పట్లతో ఆట, పాట నృత్యాలతో మహిళలు అలరించారు. అయితే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, స్థానిక నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాత పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం రోట్లో గోరింటాకు వేడుక చేస్తున్న మహిళలను, ఆటపాటలతో సందడి చేస్తున్న వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత కార్యక్రమానికి హాజరైన వారందరికీ సబితమ్మ సాంప్రదాయ పోలెలను స్వయంగా వడ్డించారు.

**స్నేహానికి, ప్రేమకు, శుభానికి ప్రతీక గోరింటాకు: సబితారెడ్డి**

మన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని గోరింటాకు ప్రతిబింబింపజేస్తుందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఆషాఢ గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించడం.. మహిళలందరూ ఉత్సాహంగా తరలివచ్చి వేడుకల్లో భాగస్వాములవడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోరింటాకు స్వచ్ఛమైన ప్రేమ, స్నేహానికి ప్రతీక అని అన్నారు. అంతే కాకుండా శుభ సూచకం కూడా గోరింటాకు నిలుస్తుందని ఆమె వెల్లడించారు. ఆషాఢ మాసంలో గోరింటాకు వేడుకలు మహేశ్వరం నియోజకవర్గంలోని మహిళల కుటుంబాల్లో సుఖ సంతోషాలను తీసుకురావాలని సబితారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మహిళా కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, భీమిడి స్వప్న జంగారెడ్డి, బోయపల్లి దీపికా శేఖర్‌రెడ్డి, బొద్రమోని రోహిణి రమేష్ ముదిరాజ్, జెనిగె భారతమ్మ కొమురయ్య యాదవ్, మాజీ ఎంపిటిసి లలితా జగన్, పాలపర్తి విజయలక్ష్మి, మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు గుర్రం ప్రసన్న వెంకట్‌రెడ్డి, జిల్లెలగూడ టెంపుల్ మాజీ ధర్మకర్త సుర్వి లత శేఖర్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాళ్లు స్వప్నారెడ్డి, ఉర్మిళారెడ్డి, తుమ్మల నిర్మలారెడ్డి, గాయత్రి, గీత, శారద పాల్గొన్నారు.

## 42శాతం బిసి రిజర్వేషన్ ఆమోదం పట్ల హర్షం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలో అభిషేకం చేస్తున్న ఉపేందర్‌రెడ్డి, గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, జులై 11 ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుందని, ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబ రాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్.కె.పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్‌నేత ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు అవసరమైన ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ చారిత్రా త్మక నిర్ణయాన్ని అమలు పరచేందుకు కృషి చేసిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఖిల్లామైసమ్మ దేవాలయం చైర్మన్ సురేందర్‌కుమార్, గట్ల రవీందర్, ప్రసన్నాంజనే యస్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్నేత, లింగ స్వామిగౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, యాదవరెడ్డి పగడాల శ్రీశై లం, సందీప్, శ్యాం సుందర్ గౌడ్, లక్ష్మీ, పెద్దవూర సైదులు, ధల్లీ, జగన్నాథం, సంతోష్, సాయి, చిన్నయాదవ్, అనిల్ పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ విజయదుర్గా మాత



**సైదాబాద్, జులై 11 ప్రభాతవార్త:** సైదాబాద్ మాతా మైదానంలోని కొలువుదీరిన శ్రీ విజయదుర్గా మాత శుక్రవారం నశాకాంబరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష అభిషేకాల అనంతరం వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ఆషాడ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హరిగౌడ్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నంఅన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి ప్రతినిధులు రవి శంకర్, అల్లి శ్రవణ్ కుమార్, సునీల్‌రెడ్డి, సంగీత రెడ్డి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా దేవాలయ వద్ద ఏర్పాట్లు చేయాలి



**మేడిపల్లి ,జూన్ 11 ప్రభాతవార్త ;** బోనాల పండుగను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దేవాలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున మున్సిపల్ కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20వ తేదీన బోనాల పండుగ జరగనున్న నేపథ్యంలో, ప్రజల ఆత్మీయతకు అద్దంపట్టే విధంగా ఆలయాల వద్ద పూల అలంకరణ, రంగుల వెలిగింపులు, విద్యుత్ దీపాలు, శబ్ద వ్యవస్థల ఏర్పాట్లు చేయాలని పార్టీ నాయకులు కోరారు. ముఖ్యంగా మహిళలు, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగలో పాల్గొనే విధంగా ఆలయాల వద్ద పారిశుద్ధం, తాగునీటి సదుపాయాలు, తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయాలని, దేవాలయాలకు వెళ్లే రహదారులపై గుంతలు పూడ్చి, స్ట్రీట్ లైట్లను పునరుద్ధరించాలంటూ నగర బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘు వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లేతకుల మాధవి రఘుపతి రెడ్డి తో కలిసి మున్సిపల్ కమీషనర్ త్రిశేశ్వర్ రావుకు వినతిపత్రం అందచేశారు . ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, బాలరాజు,యాసారం శ్రీనివాస్, కోనేటి వెంకట్, పింగళి జోగిరెడ్డి, గడీల జగన్ రెడ్డి, శ్యామల నరసింహ, అశోక్, సతీష్, మల్లం వెంకటేష్ గౌడ్, ఉపేందర్, కిరణ్ నాయక్, శంకర్ రావు, పాశం నరేందర్, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకామాయి సాయిబాబా పీఠంలో పార్థసారథిరెడ్డి పూజలు



పీఠాధిపతితో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్‌లోనున్న ఆధ్యాత్మిక పీఠం శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠాన్ని రాజ్యసభ సభ్యుడు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మాజీ మెంబర్, ప్రముఖ హెటిరో గ్రూపు సంస్థల చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి సందర్శించారు. గురు పౌర్ణమి సందర్భంగా గురువారం సాయంత్రం పీఠానికి విచ్చేసిన ఆయన సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దత్త సిద్ధాంత ఆదికర్త, పీఠాధిపతి అయిన పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీని గురు పౌర్ణమిని పురస్కరించుకొని సన్మానించారు. ఈ సందర్భంగా స్వామీజీ పార్థసారథిరెడ్డికి మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ, అబ్బూరి సుధాకర్, మల్లాది సాయిలలిత్ పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకలలో గురువులకు ఘన సన్మానం



గురుపౌర్ణమి వేడుకలలో మాట్లాడుతున్న ప్రభాకర్.

**వనస్థలిపురం. జూలై. 11.ప్రభాతవార్త :** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బి.ఎన్.రెడ్డి డివిజన్ పరిధిలో ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ కన్వెన్షన్ హాల్లో గురు పూర్ణిమ దినోత్సవం సందర్భంగా గురువులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ - "సంస్కృతి, పరంపరలను నిలిపే బాధ్యత గురువులదే. వారు చూపే మార్గం సమాజ నిర్మాణానికి దిశానిర్దేశం చేస్తుంది" అని అన్నారు.రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ - "గురువులను గౌరవించడం మన భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాముఖ్యమైన అంశం. యువత సద్గురువుల ఆశీస్సులతో అభివృద్ధి చెందాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి గారు, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ గారు, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్, రవీందర్ రెడ్డి, నూతి శ్రీనివాసరావు, జయప్రకాశ్,మల్లేష్ గౌడ్ , రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి నందికొండ గీతారెడ్డి,సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో పార్కును అందుబాటులోకి తీసుకువస్తాం



పార్కు పనులపై కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్.

**హయత్ నగర్, జులై 11 ప్రభాతవార్త:** పార్కు పనులను త్వరగా పూర్తి చేయించి సాధ్యమయినంత త్వరలో కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకు వస్తామని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి మిధాని కాలనీలో అత్యాధునిక హంగులతో కొనసాగుతున్న పార్క్ అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం కాలనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీ వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు పార్కు సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అతి త్వరలోనే పనులు పూర్తయితాయన్నారు. కార్యక్రమంలో కాలనీ సభ్యులు యాదిరెడ్డి, అంజయ్య గౌడ్, తిరుమల రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**వనస్థలిపురం. జూలై.11.ప్రభాతవార్త.** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంజాపూర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం అయింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంజాపూర్ గ్రామ కమాన్ సమీపంలో బస్టాండ్ వెనుకవైపు ఓ వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడని శుక్రవారం మధ్యాహ్నం స్థానికుల నుండి వనస్థలిపురం పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పెట్రోలింగ్ వాహనం లో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉండి,5 అడుగుల 7 అంగుళాలు ఎత్తు ఉండి, బ్లూ కలర్ గీతల షర్ట్, బ్లూ కలర్ జీన్స్ దుస్తులు ధరించిఉన్నాడు. శరీరంపై ఎటువం టి గాయాలు లేవని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించడానికి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బలాల



ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్ పేట ,జూలై 11 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్పేట పంచశీల గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బలాల ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలల మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య శిబిరాలు ఎంతగానో దోహాలు తెలిపారు అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మలక్ పేట క్లస్టర్ వైద్యాధికారి బ్రిడ్జిస్ ఉన్నిసా, డివిజన్ ఎంఎం నాయకులు సైఫుద్దీన్ షఫీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కార్పొరేటర్



**మల్కాజిగిరి జూలై11, ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. వర్షాకాల ముందస్తు శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాల్ని ప్రారంభించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు చెత్తాచెదారం రోడ్లపై వేయకుండా ఇంటి ముందుకు వచ్చే రిక్షాలను వేయాలని తెలిపారు పాడైపోయిన టైర్లు కొబ్బరి బొండాల వ్యర్ధాలను నిల్వ చేయకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు కార్యక్రమంలో మేకల రాము యాదవ్ బైరు అనిల్ శానిటేషన్ జవాన్లు పాల్గొన్నారు.

## లింగోజిగూడలో అభివృద్ధి పనులకు రూ.22.03 కోట్లు మంజూరు : కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



ప్రియదర్శిని పార్కు వద్ద నిర్మించనున్న బ్రిడ్జి నమూనా చిత్రం

**సైదాబాద్, జూలై 11 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ లో వివిధ అభివృద్ధి పనులకు రూ.22.03 కోట్లు మంజూరు కావడం జరిగిందని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎల్బినగర్‌లోని శారద వైన్స్ నుండి సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు వరకు వరదనీటి కాలువ నిర్మాణానికి రూ.5.98 కోట్లు, ప్రియదర్శిని పార్కు నుండి శారద థియేటర్ వరకు రెండు లేన్ల బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.95 కోట్లు, సరూర్ నగర్ చెరువు కట్ట మరమ్మత్తులు, బలోపేతం కోసం రూ.5.60 కోట్లు, సరూర్ నగర్ చెరువు కట్ట, గ్రీన్ పార్క్ కాలనీ, తపోవన్ కాలనీ లోని బండ్ల అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ.4.50 కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ పనులన్ని ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు.

## బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక : సుందర్‌రెడ్డి



దేవాలయ నిర్వాహకులకు చెక్కును అందజేస్తున్న సామ సుందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 11 ప్రభాతవార్త:** బోనాల పండుగ తెలంగాణా సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాలకు సంబంధించి జిహెచ్ఎంసి నుంచి సింగరేణి కాలనీలోని అమ్మవారి దేవాలయానికి మంజూరైన చెక్కును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా సుందర్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగకు అమ్మవారి దేవాలయాలకు నిధులు ఇచ్చే పద్ధతిని బిఆర్ఎస్ పార్టీ తీసుకువచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, నగేష్, విక్రమ్, దర్గయ్య, సాయి, మహేష్, పద్మారావు, వెంకటేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహపురి కాలనీలో ఓపెన్ జీమ్ ప్రారంభం



ఓపెన్ జీమ్‌లో ఎక్సర్‌జైజ్ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

**నాచారం, జులై 11 ప్రభాతవార్త :** నాచారం స్నేహపురి కాలనీ మినీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జీమ్‌ను శుక్రవారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఇలాంటి జీఎంలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ సందర్భంగా వ్యాయామం చేసిన తర్వాత కూర్చోవడానికి కార్పొరేటర్ సొంత ఖర్చుతో 3 బెంచీలను ఏర్పాటు చేయించారు.

## డ్రైనేజీ సమస్యను లాలాపేట్ జలమండలి మేనేజర్ పట్టించుకోవడంలేదు : నాగరాజు గౌడ్



నిత్యం పొంగుతున్న డ్రైనేజీ సమస్యను చూపిస్తున్న నాగరాజు గౌడ్

**తార్నాక, జులై 11 ప్రభాతవార్త :** లాలాపేట్ బాలికల పాఠశాల వద్ద తరుచుగా డ్రైనేజీ సమస్య ఉన్నా లాలాపేట్ జలమండలి మేనేజర్ మురళి పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కూరెల్లి నాగరాజు గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన లాలాపేట్‌లో మాట్లాడుతూ గత నెల నుంచి నిత్యం ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా జలమండలి వారు పట్టించుకోవడంలేదని, ఈ సమస్యపై పలు మార్లు వినతి పత్రాలను అందజేసినా వారు తమకేమి పట్టనట్లు ఉంటున్నారని ఆరోపించారు. ఇటీవల తాము మేనేజర్ వద్దకు ఫిర్యాదుకోసం వెళ్లితే దురుసుగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ సమస్యను పట్టించుకోవడంలేదన్నారు.రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సుదర్శన్, ప్రశాంత్, శరత్, బాల్‌రాజ్ తధితరులు పాల్గొన్నారు.

దశదినకర్మ



మీ ఆకస్మిక మరణం మమ్మల్ని వేదనకు గురిచేసింది. మీరు లేని లోటు మాకు తీర్చలేనిది. మీ పవిత్ర ఆత్మకు సదా శాంతి చేకూరాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తూ...

అశ్రునయనాలతో...

భార్య : చిగిరింత వసంత

కొడుకు - కోడలు : చిగిరింత రాఘవేందర్ రెడ్డి - అనూష

చెల్లెలు - బావ : కీ॥శే॥ మేకల యాదమ్మ - రాంరెడ్డి

తమ్ముళ్లు - మరదళ్లు : చిగిరింత మల్లారెడ్డి - పుష్పలత, చిగిరింత శ్రీరాంరెడ్డి - మమత

చిగిరింత కుటుంబ సభ్యులు : చిగిరింత పద్మమ్మ, కీ॥శే॥ చిగిరింత చిన్నబాల్‌రెడ్డి-శోభ, చిగిరింత యాదిరెడ్డి - భాగ్యలక్ష్మి, చిగిరింత తిరుపతిరెడ్డి - ప్రణిత, చిగిరింత నర్సింహారెడ్డి - పారిజాత, చిగిరింత జంగారెడ్డి - వనిత

కూతుళ్ళు - అల్లుళ్ళు : మద్ది హేమలత - సుమన్‌కుమార్ రెడ్డి, పేరెడ్డి సోని - శంకర్ సేనా రెడ్డి

కొడుకులు : చిగిరింత యశ్వంత్ రెడ్డి, చిగిరింత సుప్రీత్ రెడ్డి, చిగిరింత స్నికేత్ రెడ్డి, చిగిరింత దేవాన్ష్ రెడ్డి

మనుమలు & మనుమరాళ్లు : చిగిరింత కశ్విరెడ్డి, మద్ది శన్విత్‌రెడ్డి, మద్ది ధ్రువాంశ్‌రెడ్డి, పేరెడ్డి సంశిత్‌రెడ్డి, పేరెడ్డి శరణ్‌రెడ్డి

కీ॥శే॥ చిగిరింత పెద్ద బాల్‌రెడ్డి గారు

బాలాపూర్ గ్రామం, మరణం : 3-7-2025

కార్యస్థలం : నేడు తేది. 12-7-2025 శనివారం మధ్యాహ్నం 12 గం॥లకు బాలాపూర్ క్రాస్ రోడ్, ఆర్.సి.ఐ. రోడ్డులోని సి.ఆర్.ఆర్. కన్వెన్షన్‌లో దశదినకర్మ జరుగును.